# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-07-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు శ్రీశైలం ప్రాజెక్టు వద్ద కృష్ణా నది జల హారతి కార్యక్రమంలో పాల్గొంటారు.**
2. **ఢిల్లీలో పర్యటిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి చలనచిత్ర, క్రీడారంగాలకు చెందిన ప్రముఖులతో సమావేశమైయ్యారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకం కోసం యుజీసీతో చర్చిస్తున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**
4. **రైతులకు నకిలీ విత్తనాలను సరఫరా చేసే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు**
5. **విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శాకంబరి ఉత్సవాలు ఈరోజు నుండి ప్రారంభమైయ్యాయి.**

========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు నంద్యాల జిల్లాలో పర్యటిస్తారు. ఈ ఉదయం ఆయన హెలికాప్టర్‌లో శ్రీశైలం చేరుకుని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం శ్రీశైలం ప్రాజెక్టు వద్ద కృష్ణా నదికి జల హారతి ఇచ్చే కార్యక్రమంలో పాల్గొంటారు. కృష్ణమ్మకు ముఖ్యమంత్రి జలహారతి సమర్పించిన తర్వాత గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తారు. తరవాత మధ్యాహ్నం సున్నిపెంటలో నీటి వినియోగదారుల సంఘం ప్రతినిధులతో సమావేశమవుతారని అధికారులు తెలిపారు.

-------------------------

శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకుని ఆంధ్రప్రదేశ్‌ను నేర రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్-ఆర్టీజిఎస్ పై నిన్న ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సాంకేతికతను వినియోగిస్తూ నేరాలు జరిగే ప్రాంతాల పై సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలన్నారు, సీసీ కెమెరాల్లోని ఫుటేజ్‌ను సేకరించే అంశంలో ప్రజాభద్రత చట్టాన్ని వర్తింపజేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

-------------------------

ఢిల్లీలో పర్యటిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి చలన చిత్ర, క్రీడారంగాలకు చెందిన ప్రముఖులు అజయ్‌దేవగణ్, కపిల్‌దేవ్‌లతో నిన్న వేర్వేరుగా సమావేశమైయ్యారు. ఢిల్లీ లోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో సమావేశమై తమ రంగాలకు సంబంధించిన అంశాలపై వారు చర్చించారు. యానిమేషన్, వీఎఫ్ఎక్స్, వంటి సదుపాయాలను తెలంగాణలో ఏర్పాటు చేయనున్నామని ఇందుకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని అజయ్‌దేవగణ్ ముఖ్యమంత్రిని కోరారు. అలాగే భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ ముఖ్యమంత్రితో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యంగ్ ఇండియా క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు, ఇతర క్రీడల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను రేవంత్‌రెడ్డి ఆయనకు వివరించారు.

కాగా ఈరోజు కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్‌తో పాటు పలువురు కేంద్రమంత్రులతో ముఖ్యమంత్రి సమావేశమవుతారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకం కోసం, విశ్వవిద్యాలయాల నిధుల సంఘం యుజీసీతో సంప్రదింపులు జరుగుతున్నాయని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారు. నెల్లూరులో రొట్టెల పండగ సందర్భంగా బారాషాహీద్ దర్గాను మంత్రి నిన్న దర్శించుకుని, స్వర్ణాల చెరువులో ఆరోగ్య రొట్టెను అందుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ,

వాయిస్ 25 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో వ్యవసాయ రంగానికి తోడ్పాటు అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు కోరారు. ఢిల్లీ ప్యరటనలో భాగంగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్‌తో మంత్రి నిన్న ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మామిడి గుజ్జు పై విధిస్తున్న జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని కోరారు. కాగా ఈరోజు కేంద్ర పశుసంవర్థక, పాడిపరిశ్రమ శాఖ మంత్రి లాలన్ సింగ్‌ను కలసి పాడి పరిశ్రమ అభివృద్ధిపై చర్చిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

రైతులకు నకిలీ విత్తనాలను సరఫరా చేసే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ములుగు జిల్లా వాజేడులో నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన 671 మంది మొక్కజొన్న రైతులకు.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆమె నిన్న చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం సీతక్క పాత్రికేయులతో మాట్లాడుతూ, నకిలీ విత్తనాల పంపిణీని అరికట్టడానికి విత్తన చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు.

వాయిస్ 25 సెకన్లు

---------------------------

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఈఎస్ఐ ఆసుపత్రిని

మంత్రి నిన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. చికిత్స పొందుతున్న రోగులకు అందుతున్న వైద్య సేవలను గురించి ఆయన ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే, తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శాకంబరి ఉత్సవాలు ఈ రోజు నుండి ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు , మల్లేశ్వర స్వామివారి ఆలయం, ఇతర ఉపాలయాలను, దేవతా మూర్తులను ఆకుకూరలు, కాయగూరలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి శీనా నాయక్ మాట్లాడుతూ, శాకంబరిమాతగా దుర్గమ్మను దర్శించుకున్న భక్తులకు కదంబ ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నామని చెప్పారు. ఈ శాకంబరీ ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయని తెలుపుతూ...

వాయిస్ 30 సెకన్లు

---------------------------

ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వైద్య పరికరాల నిర్వహణకు రాష్ట్రస్థాయిలో ఒక ఉన్నత స్థాయి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నామని తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. హైదరాబాద్‌లో నిన్న జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి పలు ఆదేశాలు జారీ చేశారు. ఐదుగురు బయోమెడికల్ ఇంజినీర్లతో కూడిన కేంద్ర పర్యవేక్షణ బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య పరికరాల మరమ్మతు సమాచారం వచ్చిన 6 గంటల్లోపు ఆసుపత్రిని సందర్శించి చిన్న సమస్య అయితే ఒక్కరోజులో, పెద్ద సమస్య అయితే మూడు రోజుల్లోపు పరిష్కరించాలని మంత్రి సూచించారు.

---------------------------

మానవాళికి సముద్రాల ఆవశ్యకతను తెలియజెప్పేందుకు ఏటా జూలై 8వ తేదీన ప్రపంచ మహా సముద్రాల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం.. కనీసం 50 శాతం మేర ఆక్సిజన్ సముద్రం నుంచి ఉత్పత్తి అవుతుంది. భూమిపై విడుదలయ్యే 30 శాతం కార్బన్ డయాక్సైడ్‌ను సముద్రాలు గ్రహిస్తాయి. ఫలితంగా గ్లోబల్ వార్మింగ్ వల్ల కలిగే దుష్ ప్రభావాలను తగ్గిస్తాయి. సముద్రం మన ఆర్థిక వ్యవస్థకు కీలకం, 2030 నాటికి 4 కోట్ల మంది ప్రజలు సముద్ర ఆధారిత పరిశ్రమల ద్వారా ఉపాధి పొందుతారని అంచనా. ఈ రోజు సముద్రాల ఆవశ్యకత తెలియజేస్తూ అనేక దేశాల్లో పలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...27 సెకన్లు

=====================